సాక్షి ఆదిలాబాద్

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



ఫారెస్ట్‌లో ఫైర్‌లైన్స్

అడవిలో వేసవిలో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు అటవీశాఖ చర్యలు చేపడుతోంది. మూడేళ్లుగా కూలీల ద్వారా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తోంది. 8లో▸

'ఎమ్మెల్సీ' పోలింగ్ రోజున సెలవు

కైలాస్‌నగర్: పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజైన ఈ నెల 27న ఓటర్లకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌గా ప్రకటిస్తూ కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు ఈసెలవు వర్తిస్తుందని తెలిపారు. ప్రైవేట్ విద్యా,వ్యాపార, వాణిజ్యసంస్థల్లో పనిచేస్తూ ఓటర్లుగా నమోదుచేసుకున్న వారంతా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కార్మిక శాఖ అధికారులను ఆదేశిస్తూ అందులో పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.0/14.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రివేళలో చలి ప్రభావం తగ్గనుంది.

న్యూస్‌రీల్

ఆంగ్లంతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ఆ దిశగా ఉపాధ్యాయులు వారికి ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఇటీవల ఇంగ్లిష్ లాంగ్వేజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్ నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన మన్నూర్ పాఠశాల, బంగారుగూడ మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. కలెక్టర్ రాజర్షితో పాటు డీఈవో ప్రణీతను విద్యార్థులు బుధవారం కలిశారు. విద్యార్థులతో పాటు గైడ్ టీచర్లు సవితాదేవి, అజయ్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

పోషకాహారంతో రక్తహీనత నియంత్రణ

కైలాస్‌నగర్: సంపూర్ణ పోషకాహారంతో రక్తహీనత నియంత్రించవచ్చని డీఆర్డీవో రవీందర్ రాథోడ్ అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం ఆ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వెయ్యి రోజుల కార్యక్రమ నిర్వహణపై జిల్లాలోని ఏపీఎంలు, సీసీలు, మండల సమాఖ్య ఆఫీస్ బేరర్లకు పట్టణంలోని టీటీడీసీలో బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమ లక్ష్యాలు, విధానాలపై ఏపీడీ గంగన్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ఇందులో డీపీఎం హేమలత తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి



విద్యార్థినితో మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా వారికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఈవో ప్రణీత, ఉపాధ్యాయులు ఉన్నారు.

వైద్యుల రాక కోసం నిరీక్షిస్తున్న రోగులు, ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు





కంటి విభాగం వద్ద వేచి చూస్తున్న రోగులు



డెంటల్ విభాగం వద్ద నిరీక్షిస్తున్న పేషెంట్లు



వీళ్లింతే..మారరంతే!

పది దాటనిదే రారు.. పన్నెండైందంటే ఉండరు

- రిమ్స్‌లో చాలా మంది వైద్యుల తీరిది
- లక్షల్లో వేతనం ఉన్నా సమయపాలన పాటించరు
- వైద్యుల రాక కోసం రోగులకు తప్పని నిరీక్షణ
- సిబ్బంది తీరూ అదే పరిస్థితి

ఎన్ని విమర్శలు ఎదుర్కొంటున్నా రిమ్స్‌లో వైద్యుల తీరు మాత్రం మారడం లేదు. మేమింతే.. మారమంతే అన్న చందంగా మారింది చాలా మంది పరిస్థితి. సమయ పాలన విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పది దాటనిదే రావడం లేదు.. అలాగే పన్నెండయిందంటే చాలు ఉండడం లేదు. రూ.లక్షల్లో వేతనం తీసుకుంటున్నా ప్రైవేట్ ప్రాక్టీస్‌కే ప్రాధాన్యమిస్తున్నారు. రిమ్స్‌లో వైద్య సిబ్బంది సమయపాలనపై బుధవారం 'సాక్షి' విజిట్ నిర్వహించింది. చాలా మంది విధులకు ఆలస్యంగా రావడం.. నిర్దేశిత సమయానికి ముందే ఇంటి బాట పట్టడం కనిపించింది.

– ఆదిలాబాద్‌టౌన్



చిల్డ్రన్ ఓపీ వద్ద వైద్యుల కోసం నిరీక్షిస్తున్న తల్లిదండ్రులు, చిన్నారులు

జిల్లాలో ఆదివాసీ, గిరిజనులు అధికంగా ఉంటారు. ఈ ప్రాంతంతో పాటు మహారాష్ట్ర వాసులకు రిమ్స్ పెద్ద దిక్కుగా ఉంది. సుస్తీతో ఇక్కడికి వచ్చే రోగులు వైద్యుల రాకకోసం నిరీక్షించాల్సిన దుస్థితి. ఉదయం 9గంటలకు విధులకు హాజరై సాయంత్రం 4 గంటలవరకు వైద్యసేవలు అందించాల్సి ఉంటుంది. ఇందులో కొంత మంది మాత్రమే సక్రమంగా విధులు నిర్వహిస్తుండగా, చాలా మంది పది దాటినా విధులకు హాజరు కారు.. మధ్యాహ్నం పన్నెండు తర్వాత కనిపించరు. బయోమెట్రిక్ హాజరు ఉన్నా వీరిలో మార్పు రావడం లేదు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ను బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు 'సాక్షి' విజిట్ చేసింది. 9.30 గంటల వరకు కూడా ఏ ఒక్క వైద్యుడు ఆస్పత్రికి చేరుకోలేదు. 10 గంటల తర్వాత ఒకరిద్దరు రావడం కనిపించింది. డాక్టర్ల రాక కోసం రోగులు గంటల తరబడి నిరీక్షించారు. అప్పటి వరకు పీజీ విద్యార్థులు, హౌజ్ సర్జన్‌లు పేషెంట్లను పరీక్షించారు.

10 గంటల వరకు కానరాని వైద్యులు..

- గైనిక్ వార్డులో ఉదయం 9.30 తర్వాత కూడా డాక్టర్లు రాలేదు. సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉన్నారు.
- మెడికల్ వార్డులో హౌజ్‌సర్జన్, పీజీ విద్యార్థులు ఉన్నారు. డ్యూటీ డాక్టర్లు కానరాలేదు. ఆర్థోపెడిక్ వార్డులోనూ వైద్యులు కనిపించలేదు.
- రోగులకు మందులు పంపిణీచేసే ఫార్మసిలోనూ అదే పరిస్థితి. ఫార్మసిస్టులు 9.30 వరకు రాలేదు. 9.45గంటలకు ఒకరు వచ్చారు. అప్పటివరకు అటెండర్ మాత్రలు సరిచేస్తూ కనిపించాడు. మందుల కోసం రోగులు వేచి ఉన్నారు.
- ఏఆర్టీ సెంటర్‌కు వైద్యులు, సిబ్బంది 9.45 గంటల వరకు చేరుకోలేదు. గది ఎదుట రోగులు నిరీక్షించారు.
- ఆప్తమాలజీకి సంబంధించి ఒక హౌజ్ సర్జన్ రోగులకు పరీక్షలు చేస్తూ కనిపించారు. రెండు విభాగాలు ఉన్నప్పటికీ ఆయన ఒక్కరే అందుబాటులో ఉన్నారు. అప్పటికే పదుల సంఖ్యలో రోగులు ఉన్నారు. టెక్నీషియన్లు కూడా సమయపాలన పాటించలేదు. శిక్షణ విద్యార్థులు రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తూ కనిపించారు.
- మలేరియా విభాగంలో సిబ్బంది 10 గంటల వరకు రాలేదు. ఓపీలో హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించే సిబ్బంది లేకపోవడంతో గంటల తరబడి రోగులు, గర్భిణులు వేచి ఉన్నారు. ఉదయం 8 గంటల నుంచే తమ వంతు కోసం గది ముందర పడిగాపులు కాశారు.
- డెంటల్ విభాగంలో వైద్యులు రాకపోవడంతో పదుల సంఖ్యలో రోగులు అక్కడ ఉన్న కుర్చీల్లో నిరీక్షించారు. ఈ డాక్టర్లు కూడా 10 గంటల వరకు రాలేదు.
- చిల్డ్రన్ ఓపీలో 9.45 గంటల తర్వాత ఒక హౌజ్ సర్జన్ విధులకు హాజరయ్యారు. పిల్లలకు వైద్య పరీక్షలు చేయించేందుకు తల్లిదండ్రులు గది ఎదుట బారులు తీరినప్పటికీ వైద్యులు కనిపించలేదు.
- ఆర్‌బీఎస్‌కే విభాగంలో ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. బ్లడ్‌బ్యాంక్‌లో శిక్షణ పొందే విద్యార్థులతో పాటు ఒక ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉన్నారు. 10 గంటల వరకు మెడికల్ ఆఫీసర్ విధులకు హాజరు కాలేదు.
- 10 గంటల సమయంలో ఎమర్జెన్సీ ఇన్‌వార్డును పరిశీలించగా.. వైద్యులు కనిపించారు. రోగులకు వైద్య సేవలు అందించారు.
- ట్రామాకేర్‌లో 10గంటల వరకు వైద్యులు రాలేదని రోగులు తెలిపారు. హౌస్‌సర్జన్ మాత్రమే వచ్చి పరీక్షలు చేశారని పేర్కొన్నారు.
- గైనిక్ ఇన్‌వార్డులో ఒక పీజీ వైద్యురాలు మాత్రమే అందుబాటులో ఉన్నారు. 10 గంటలు దాటినా మిగతా వైద్యులు రాలేదని అక్కడి సిబ్బంది తెలిపారు.

ఎనిమిది గంటలకే వచ్చాం..



నా మనువడికి జ్వరం రావడంతో ఉదయం ఎనిమిది గంటలకే ఇక్కడికి వచ్చాం. 10 దాటినా డాక్టర్లు రాలేదు. ఇప్పుడిప్పుడే ఓ ట్రెయినీ డాక్టర్ వచ్చారు. డాక్టర్ల కోసం గంటల తరబడి చూడాల్సి వస్తుంది. చానా ఇబ్బందులు పడుతున్నాం. – చంద్రకళ, కేఆర్‌కే కాలనీ

వచ్చి రెండు గంటలు దాటింది..



రక్త పరీక్షల కోసం గంటల తరబడి వేచి చూస్తున్నాం. మంగళవారం చూసిన డాక్టర్లు ఈ రోజు ఉదయం 8 గంటలకే టెస్టులు చేసుకోవాలని చెప్పడంతో పొద్దుగాల వచ్చాం. పదయినా ఇంకా సిబ్బంది రాలే. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.

– అర్చన, ఇచ్చోడ

రిమ్స్‌లో కొంత మంది వైద్యుల తీరు మారడం లేదు. ఇందులో పనిచేసే చాలా మంది డాక్టర్లకు జిల్లా కేంద్రంలో ప్రైవేట్ క్లినిక్‌లు ఉన్నాయి. ఉదయం అక్కడ రోగులను పరీక్షించిన తర్వాత రిమ్స్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత మళ్లీ క్లినిక్‌లోనే దర్శనమిస్తారు. ఇలా వారు రెండు చేతుల సంపాదిస్తున్నారే తప్ప సర్కారు దవాఖానాకు వచ్చే పేదలకు మాత్రం న్యాయం చేయలేకపోతున్నారు. ఎమర్జెన్సీ ఉంటే తప్పా అక్కడికి రావడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో కొంత మంది రోగులు మృత్యువాత పడుతున్న ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. సమయపాలన పాటించని వైద్యులపై అధికారులు చర్యలు చేపట్టకపోవడంతోనే వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఉదయం బయోమెట్రిక్ హాజరు పెట్టిన తర్వాత మధ్యాహ్నం కనిపించకుండా పోతారు. ఒకేసారి హాజరు ఉండడంతో విధులకు డుమ్మా కొడుతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు వీరిపై దృష్టి సారిస్తే తప్పా రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందే పరిస్థితి లేదని పలువురు పేర్కొంటున్నారు.

మారని తీరు..

అక్రమాలు నిజమే..

- జిల్లాలో పత్తి కొనుగోళ్లలో గోల్‌మాల్
- నిర్ధారించిన అధికారులు
- వరంగల్ రీజియన్‌లో ఏడుగురిపై వేటు
- అందులో ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శిపై కూడా..
- టీఆర్‌లలో తేడాల ఆధారంగా చర్యలు
- అక్రమాలపై ముందే చెప్పిన 'సాక్షి'



జిల్లాలో ఈ సీజన్‌లో పత్తి కొనుగోళ్ల వివరాలు
మొత్తం కొనుగోలు చేసిన పత్తి 27,07,479 క్వింటాళ్లు
సీసీఐ కొనుగోలు చేసింది 25,41,278 క్వింటాళ్లు
ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసింది 1,67,017 క్వింటాళ్లు
మద్దతు ధర (క్వింటాలుకు) రూ.7,421 (రూ.100 తగ్గింపు తర్వాత)
జారీ అయిన టీఆర్‌ల సంఖ్య సుమారు 5వేల వరకు
ఆదిలాబాద్ మార్కెట్‌లో టీఆర్‌లు : 3,457జారీ



ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలో పత్తి కొనుగోళ్లలో అక్రమాలు నిజమే అని తేలింది. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారులు పలువురిపై వేటు వేశారు. వరంగల్ రీజియన్ పరిధిలో ఏకంగా ఏడుగురిని సస్పెండ్ చేయగా అందులో ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శి కూడా ఉండడం గమనార్హం. ఈ అక్రమాలపై 'సాక్షి' సైతం వరుస కథనాలను ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లింది.

అక్రమాల తీరిది..

ఒక రైతుకు చెందిన వ్యవసాయ భూమిని మరో రైతు కౌలుకు తీసుకొని సాగు చేశాడు. వచ్చిన దిగుబడిని మార్కెట్లో సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందాలంటే పట్టా రైతుభూమికి సంబంధించి క్రాప్ బుకింగ్‌లో పేరు నమోదై ఉండాలి. దాని ఆధారంగా కౌలు రైతు తాను సాగు చేయగా వచ్చిన దిగుబడిని మద్దతు ధరకు అమ్ముకునేందుకు తన పేరిట పత్రం జారీ చేయాలని వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకుంటాడు. ఆ ప్రకారం కౌలు రైతుకు వ్యవసాయ శాఖ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తుంది. ఆ పత్రాన్ని మార్కెటింగ్ అధికారులకు ఇస్తే ఆ దిగుబడిని సీసీఐకి విక్రయించుకునేందుకు వారు టెంపరరి రిజిస్ట్రేషన్ (టీఆర్) జారీ చేస్తారు. అయితే వ్యవసాయ శాఖ జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలకు, మార్కెటింగ్ అధికారులు ఇచ్చిన ఇలాంటి టీఆర్‌లలో భారీ తేడాలు ఉన్నట్లు రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు విచారణలో తాజాగా గుర్తించారు.

సస్పెన్షన్ వేటు..

ఈ విచారణ ఆధారంగా రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు మంగళవారం వరంగల్ రీజియన్ పరిధిలో ఏడుగురు మార్కెట్ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేశారు. అందులో ఆదిలాబాద్ సెక్రెటరి మధుకర్ కాంబ్లే కూడా ఉన్నారు. ప్రస్తుతం ఇది సంచలనం కలిగిస్తుంది. ఆదిలాబాద్ మార్కెట్లో ఈ టీఆర్‌లు ఈ ఏడాది వేలాదిగా జారీ అయ్యాయి. మొత్తంగా వీటి జారీలో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇంకెన్ని అక్రమాలు బయటకొస్తాయో చూడాల్సిందే. కాగా వ్యవసాయ శాఖ జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలతో పోల్చితే మార్కెటింగ్ శాఖ జారీ చేసిన టెంపరరి రిజిస్ట్రేషన్ పత్రాలలో వ్యవసాయ భూమి విస్తీర్ణం పరంగా ఎక్కువగా చూపించడం ద్వారా ఈ అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలుస్తోంది. అధిక దిగుబడిని దళారులు సీసీఐకి మద్దతు ధరతో విక్రయించడం ద్వారా అక్రమాలకు పాల్పడ్డారని తెలుస్తోంది. రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు మాత్రం ఈ పత్రాల పరంగా తేడా ఉన్నట్లు స్పష్టం చేసినప్పటికీ ఆ తేడా ఏ విధంగా ఉందనేది పేర్కొనలేదు. ఇదిలా ఉంటే జిల్లా మార్కెటింగ్ అధికారుల నుంచి రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు ఎలాంటి నివేదిక కోరనట్లు తెలుస్తోంది. రాష్ట్రస్థాయిలోనే ఈ అక్రమాన్ని గుర్తించి చర్యలు తీసుకున్నట్లు జిల్లా అధికారులు అభిప్రాయ పడుతున్నారు.



సస్పెన్షన్‌కు గురైన ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శి మధుకర్ కాంబ్లే

వేలాది టీఆర్‌ల జారీ..

జిల్లాలోని ఇతర మార్కెట్లలో కూడా ఇలాంటి అక్రమాలు పెద్ద ఎత్తున చోటు చేసుకున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు వాటిపై కూడా దృష్టి సారిస్తారా అనేది ప్రస్తుతం చూడాల్సిందే. ఈ సీజన్‌లో జిల్లా పరంగా ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఆదిలాబాద్, బోథ్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, జైనథ్ పరిధిలో 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సీసీఐ రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసింది. అయితే ఆదిలాబాద్ మార్కెట్లోనే సీసీఐ పత్తి కొనుగోళ్లు పెద్ద మొత్తంలో జరిగాయి. దీంతో మార్కెటింగ్ అధికారులు ఈ మార్కెట్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ముందే చెప్పిన 'సాక్షి'..

పత్తి కొనుగోళ్లలో గోల్‌మాల్?



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

జిల్లాలో పత్తి కొనుగోళ్ల పరంగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని 'సాక్షి' ముందుగానే వెలుగులోకి తీసుకువచ్చింది. వరుస కథనాలను ప్రచురించింది. వీటిపై ప్రభుత్వం దృష్టి సారించింది. విచారణ జరిపిన మార్కెటింగ్ శాఖ అధికారులు అక్రమాలను నిర్ధారిస్తూ పలువురిపై సస్పెన్షన్ వేటు వేయడం ప్రస్తుతం సంచలనంగా మారింది.

రాష్ట్ర అధికారులే విచారణ చేశారు



పత్తి పంట ధ్రువీకరణ పత్రాలు, టెంపరరి రిజిస్ట్రేషన్ (టీఆర్)లలో తేడాలు ఉన్నట్లు రాష్ట్ర అధికారులు విచారణలో నిర్ధారించి నేరుగా చర్యలు తీసుకున్నారు. జిల్లా మార్కెటింగ్ కార్యాలయం నుంచి దీనికి సంబంధించి ఎలాంటి నివేదిక కోరలేదు. రాష్ట్ర అధికారులు ఏవిధంగా విచారణ జరిపారు. నిర్ధారణ ఎలా చేసుకున్నారో అనే విషయాలు మా దృష్టిలో లేవు.

– గజానంద్, జిల్లా మార్కెటింగ్ అధికారి

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి



మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేయాలని వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, సెక్టోరియల్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి వారి ప్రగతి వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. అలాగే విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను పరిశీలించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా తరగతులు బోధించాలని, ప్రతిరోజు రెండు మూడు తరగతులను పరిశీలించాలని సూచించారు. పర్ఫామెన్స్ విధంగా చూస్తే జిల్లాల పరంగా ఆదిలాబాద్ వెనుకబడి ఉందని తెలిపారు. సమావేశంలో డీఈవో ప్రణీత, ఏడీ వేణుగోపాల్ గౌడ్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి కందుల గజేందర్, సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ, సుజాత్ ఖాన్, నారాయణ, శ్రీకాంత్ గౌడ్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వివరాల నమోదు ప్రక్రియ వేగవంతం

- 'రేషన్' డేటా ఎంట్రీ 70 శాతం పూర్తి



ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

కైలాస్‌నగర్: జిల్లాలో రేషన్‌కార్డు దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఈనెల 12 వరకు వందశాతం పూర్తి చేయాలనే కలెక్టర్ ఆదేశాలకనుగుణంగా తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. 24 గంటల పాటు ప్రక్రియ కొనసాగేలా విధులు కేటాయించారు. దీంతో నమోదు ప్రక్రియ వేగంగా సాగుతోంది.

40,650 దరఖాస్తుల వివరాలు నమోదు..

కొత్త రేషన్‌కార్డులు, మార్పులు, చేర్పుల కోసం జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన, వార్డు, గ్రామసభల్లో 57,800 దరఖాస్తులు అందాయి. అందులో ఇప్పటి వరకు 40,650 దరఖాస్తుల వివరాల నమోదు పూర్తయినట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వాజీద్ అలీ తెలిపారు. ఇంకా 17,150 దరఖాస్తుల వివరాలు ఎంట్రీ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. గురువారం సాయంత్రంలోగా వంద శాతం పూర్తయ్యే అవకాశముందని తెలిపారు. ఆయా మండలాల నుంచి కార్యాలయానికి అందిన దరఖాస్తులను పరిశీలించి ఆమోదం కోసం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తామని ఆయన వెల్లడించారు. గడిచిన పదేళ్లలో ఇప్పటి వరకు కొత్త రేషన్‌కార్డుల కోసం కానీ, మార్పులు, చేర్పుల కోసం కానీ దరఖాస్తు చేసుకోని వారు మాత్రమే మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.